నేడు ప్రత్యేక కార్యక్రమాలు

నల్లకుంట: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని నేడు(సోమవారం) న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతీ ఆలయం(న్యూ రామాలయం)లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.
చిక్కడపల్లి: నేడు శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం తెలిపారు.
ముషీరాబాద్: గాంధీనగర్ ఘంటసాల క్రీడామైదానంలో సోమవారం అయోధ్య రామసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు రమేశ్, శ్రీను, సురేశ్ తెలిపారు. రామమందిర ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'ప్రాణప్రతిష్ట'ని ఉత్సవంలా నిర్వహిస్తాం

అంబర్‌పేట్: అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహిస్తామని జైస్వాల్ గార్డెన్ రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. కాలనీలోని మైసమ్మ ఆలయంలో అసోసియేషన్, ఆలయ కమిటీ ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతినిధులు రామేశ్‌గౌడ్, ప్రసన్నంజనేయులు, రామగౌడ్, మధుసూదన్‌చారి, సురేందర్ పాల్గొన్నారు.

శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన ర్యాలీ

ముషీరాబాద్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని సనాతన జాగృతి మంచ్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ శివాలయం చౌరస్తా, భరత్‌నగర్ తదితర ప్రాంతాలలో ర్యాలీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. హిందువుల ఆకాంక్ష నెరవేర్చేలా ప్రధాని మోదీ పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సనాతన జాగృతి మంచ్ నాయకుడు, బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్, అనిల్‌కుమార్, బద్రీనారాయణ, అనిల్‌కుమార్, కంచి ముదిరాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రామ మందిర నమూనాతో ప్రచారం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన పురస్కరించుకొని ఆదివారం ఇంటింటికీ రామమందిర నమూనాను తీసుకెళ్లి పూజలు నిర్వహించారు.

చైతన్య సేద్యం డైరీ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి 'చైతన్య సేద్యం' డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోతునేని సుదర్శన్, సాగర్, చైతన్య సేద్యం పత్రిక ఎడిటర్ ప్రొఫెసర్ అరెబండి ప్రసాద్ రావు, సారంపల్లి మల్లారెడ్డి, పి.జంగారెడ్డి, జి.రాములు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

కాచిగూడ: గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్ లేన్‌లో రూ.9.50 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. జలమండలి మేనేజర్ షాకీర్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అడ్రస్ చెప్పలేకపోతున్న వృద్ధురాలు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఓ వృద్ధురాలు రోడ్డుపై తిరుగుతుండగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ ఓరుకొండ సీతయ్య ఆమెతో మాట్లాడి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించారు. ఆమె పేరు నరసమ్మ, అని భర్త వెంకటయ్యగా చెప్పింది. వయస్సు దాదాపు 75 సంవత్సరాలుగా గుర్తించారు. కొత్తగూడెం ప్రాంతానికి చెందినవారిగా తెలిసింది. అయితే, ఇతర వివరాలు, చిరునామా సైతం చెప్పలేకపోతోందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆమెను గుర్తించినవారు పోలీస్ స్టేషన్‌లో లేదా ఫోన్: 87126 60160లో సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి సన్మానం

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆ పార్టీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు తేజాగౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా తేజాగౌడ్ ఆయనకు ప్రత్యేక మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికిరణ్, ప్రభూ, గౌతం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు సంక్రాంతి సంబరాలు

ముషీరాబాద్: తెలంగాణ–తమిళనాడు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్ క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ధర్మగోశన్, కోశాధికారి నెహ్రూశాస్త్రి, నాయకులు జగదీశ్, సర్వసన్, వసుధామోహన్, గన్నిశీలన్, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సొసైటీల సమస్యలపై వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏజెన్సీ ఏరియాల్లో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించడంతో పాటు బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని కల్లుగీత కార్మిక సంఘం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదివారం వినతిపత్రం ఇచ్చింది. వారిలో సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు వి.వెంకటనర్సయ్య, ఎం.కృష్ణస్వామిగౌడ్, బోయపల్లి సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటరు నమోదు, సవరణలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆదివారం పరిశీలించారు.

నేడు 'సత్యం' మూడో బ్రాంచ్ ప్రారంభం

కాచిగూడ: హోమియోపతి వైద్యాన్ని అందరికీ అందుబాటులో తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సత్యం హోమియోపతి చైర్మన్ గుజ్జ సత్యనారాయణ తెలిపారు. కాచిగూడలో ఆదివారం ఆయన మాట్లాడారు. కొత్తపేట, డాక్టర్స్ కాలనీలో సత్యం హోమియోపతి మూడో బ్రాంచ్‌ని నేడు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వివాహ పరిచయ వేదికలతో మేలు

కాచిగూడ: వివాహ పరిచయ వేదికలతో ఎంతోమందికి మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. వెంకటేశ్వర్ రావు, లక్ష్మణ్, శంకర్, సూర్యప్రకాశ్, రాఘవేందర్, హనుమంతరావు, రాధాకృష్ణ, శ్రీనివాస్, సురేశ్ బాబు, దామెర జ్ఞానేశ్వర్, జితేందర్, వినోద్ కుమార్, మణికొండ రమేశ్ కుమార్, ఏనుగుల మాణిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ

కవాడిగూడ: హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర కేలండర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మల్లారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జలమండలి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ప్రధాన కార్యదర్శి బి.కిరణ్ కుమార్, జలమండలి కార్మికులు పాల్గొన్నారు.

నెరవేరిన కరసేవకుల కల

- 21 రోజుల పాటు మిర్జాపూర్ జైలులో గడిపిన కరసేవకులు
- సత్రం నుంచి తప్పించుకొని అయోధ్యకు చేరిన వైనం
- వారణాసి రైల్వేస్టేషన్‌లో మారువేషంలో కలిసిన టైగర్ నరేంద్ర



1990లో దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో అయోధ్యకు బయలుదేరిన కరసేవకులు(ఫైల్)



మిర్జాపూర్ జైలులో ఉన్నట్లు జైలు అధికారులు ఇచ్చిన రసీదు(ఫైల్)

ముషీరాబాద్: కరసేవకుల చిరకాల స్వప్నం నిజమైంది. వందల ఏళ్ల వివాదానికి తెరపడి అయోధ్యలో శ్రీరామమందిరం నిర్మితమై.. బాలరాముడు నేడు కొలువుదీరుతున్నాడు. అయితే, దీనికి సుమారు 30 ఏళ్ల క్రితం దేశవ్యాప్తంగా కరసేవకులు అయోధ్యకు వెళ్లి రామమందిర నిర్మాణం కోసం పెద్ద ఉద్యమం చేపట్టి.. జైళ్లకు వెళ్లి.. లాఠీ దెబ్బలు తిన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కూడా సుమారు 60–70 మంది రెండు దఫాలుగా కరసేవ పేరుతో అయోధ్యకు వెళ్లడం విశేషం.అంగరంగ వైభవంగా శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో నాడు జరిగిన సంఘటనలు, అందులో పాల్గొన్న వారి మనోగతం..

మొదటిసారి 1990లో...
ఉత్తరప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రిగా ములాయమ్‌సింగ్ యాదవ్ ఉన్నారు. మొదటిసారి బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఇతర హిందూ సంస్థలు అయోధ్యలో రామమందిర నిర్మాణం జరగాలంటూ ఉద్యమం చేపట్టారు. ఈక్రమంలో ఛలో అయోధ్యకు పిలుపునిచ్చారు. దీంతో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అప్పటి బీజేపీ అగ్రనాయకులు నందరాజ్ గౌడ్, ఎన్‌వీఎఫ్ఎస్ ప్రభాకర్, శేష సాయి, బి.జైరామ్‌రెడ్డి, రఘువీర్ నేతృత్వంలో సుమారు 60 మంది దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో కరసేవకు బయలుదేరారు. మొదట హిటాచీలో దిగి అక్కడ నుంచి మరో ట్రైన్‌లో వారణాసి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జీగా ఉన్న ఆలే నరేంద్ర మారువేషంలో అక్కడకొచ్చి కర సేవకులను కలుసుకున్నారు. మరుసటి రోజు అయోధ్యకు వెళ్లే ట్రైన్ నెంబర్ రాసివ్వడంతో పాటు ప్రతి పది మందినీ ఒక గ్రూప్‌గా విభజించి ఎవరెవరు ఎక్కడ ట్రైన్ లాగి దిగాలో సూచించారు. వీరితో పాటు దేశం నలుమూలల నుంచి వారనాసి స్టేషన్‌కు వేలాదిగా కర సేవకులు తరలిరావడంతో పోలీసులు అయోధ్యకు వెళ్లే వారిని అడ్డుకొని అరెస్టు చేశారు.

మిర్జాపూర్ జైల్లో 21 రోజులు...
కరసేవకులను వారణాసి సమీపంలో ఉన్న మిర్జాపూర్ జైలుకు తరలించాలనుకున్నా అక్కడ జనాలు కిక్కిరిపోవడంతో పక్కనే ఉన్న ఓ సత్రంలో వీరిని నిర్బంధించారు. అయితే కొంత మంది కర సేవకులు సత్రానికి పెద్ద రంధ్రం చేసి రోజుకు ఒకరు ఇద్దరు చొప్పున పారిపోయి అయోధ్యకు చేరుకుంటున్నారు. ఈక్రమంలో పోలీసులు ప్రతి రోజు వీరిని లెక్కిస్తుండగా రోజుకు 2–3 తక్కువ కావడంతో అనుమానం వచ్చి పరిశీలించగా పెద్ద రంధ్రాన్ని గుర్తించారు. ఆరు రోజుల తర్వాత పారిపోయిన వారిని పట్టుకొని మిర్జాపూర్ జైలుకు తరలించారు. 21 రోజుల అనంతరం అప్పటి ములాయిన్‌సింగ్ ప్రభుత్వం వీరిని విడుదల చేసింది.

రెండోసారి 1992 డిసెంబర్‌లో..
అప్పుడు ఉత్తరప్రదేశ్‌కు బీజేపీ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ ఉండటంతో హైదరాబాద్ నుంచి రెండోసారి కర సేవకు వెళ్లినవారికి ఎలాంటి ఆటంకం కలగలేదు. అయోధ్యలో వీరంతా వారం రోజుల పాటు ఉన్నారు. అప్పుడు రాముడి జన్మస్థానంలో ఉన్న మసీదును కూలగొడుతున్న సమయంలో కూడా వీరందరు అక్కడే ఉండి.. 9వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

తప్పిపోయిన అనురాధా దామోదర్...
అందరితో పాటు మహిళా కార్యకర్త అనురాధా దామోదర్ అయోధ్యకు వెళ్లారు. అయితే వారణాసి రైల్వేస్టేషన్‌లో దిగిన తర్వాత ఆమె తప్పిపోయారు. ఈక్రమంలో హైదరాబాద్ బీజేపీ నేతలతో ఆమెకు సంబంధాలు తెగిపోయాయి. స్టేషన్‌లోనే ఉండి మళ్లీ అక్కడే హైదరాబాద్ బీజేపీ నేతలకు కలుసుకున్నారు.

స్వప్నం సాకారమైంది



నాకు 20 ఏళ్ల వయస్సున్నప్పుడు రెండుసార్లు అయోధ్యకు వెళ్లి కరసేవలో పాల్గొన్నా. కరసేవలో పాల్గొన్న వారిలో నేనే చిన్న వాడిని. మిర్జాపూర్ జైలులో 21 రోజులు ఉన్నా. అప్పుడు మేము ఏదైతే ఆశించామో ఇప్పుడు అంటే 32 ఏళ్ల తర్వాత శ్రీరాముడి ఆలయం నిర్మితమైంది.
– కొండపల్లి మాధవ్

ఇంట్లో చెప్పకుండా వెళ్లా



నేను నాడు బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల్లో ఒకడిని. నాతో పాటు మరికొంత మంది నాయకత్వంలో కరసేవకు రెండుసార్లు వెళ్లా. 21 రోజుల పాటు జైలు జీవితం గడిపా. రెండోసారి ఇంట్లో చెప్పకుండా వెళ్లడంతో అంతా ఆందోళనకు గురైయ్యా. దీనికి తోడు అప్పట్లో హిందూముస్లిం ఘర్షణలు జరుగుతుండటంతో ఇంట్లో వాళ్లు ఆందోళన చెందారు. చివరకు క్షేమంగా ఇంటికి తిరిగి రావడంతో వారంతా సంతోషించారు.
– శేష సాయి, అడిక్‌మెట్

ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగేశ్వర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలతో పాటు రోడ్డు సౌకర్యం ఉన్న పల్లెలకు బస్సుల సంఖ్య పెంచాలని, విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు నడిపించాలని కోరారు. మహాలక్ష్మి పథకం వల్ల కోల్పోతున్న ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లించాలని, ఇందుకోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని సూచించారు. సిబ్బందిని కుదించే చర్యలను వీడి.. వెంటనే సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అలాగే ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొన్నారు.

మన సంస్కృతిని భావితరాలకు అందించాలి



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: అంతరించిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం ముషీరాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ముషీరాబాద్ పద్మశాలి సంఘం ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అతినగరం సుదేశ్, మనోహర్, సీనియర్ కత్తుల సుదర్శన్, రమేశ్, సంఘం కోశాధికారి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గణేశ్, యువజన అధ్యక్షుడు శ్రీధర్, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఊర్మిళ ఉన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల అందజేత



కుట్టుమిషన్లు అందిస్తున్న హరీశ్‌రెడ్డి, కార్పొరేటర్

కవాడిగూడ: మహిళలు అన్ని రంగాలలో రాణించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారాడైజ్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కె.హరీశ్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారాడైజ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో పూల్‌బాగ్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో మూడు నెలలుగా కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, సబ్సిడీ ధరలకు కుట్టుమిషన్లు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ వి.మధు, కార్యదర్శి లయన్ బిస్వారంజన్ ఆగస్టీ, కోశాధికారి లయన్ ఎంఎస్ ప్రకాశ్, ప్రాజెక్ట్ చైర్ పర్సన్ లయన్ చేరుపల్లి గణేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఈ కమ్యూనిటీ హాల్‌లో కుట్టు శిక్షణలో మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, చంద్రమోహన్, కమలాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేశ్, ఎ.పరిమళ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రగతిలో మహిళలు కీలక భాగస్వామిగా ఉన్నారన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ మహిళా మోర్చా నేతలు శిల్పారెడ్డి, కె.గీతామూర్తి, విజయ పాల్గొన్నారు.

భవన నిర్మాణం కోసం వినతి
ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఆదివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందగిరి నర్సింహ్మ, బస్తీ నాయకులు కె.ఎల్.సత్యనారాయణ, రాజు వారితో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రమోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

24న అనసూయ సంస్మరణ సభ

కాచిగూడ: మున్నూరుకాపు భవన్‌లో ఈ నెల 24న వీరభద్ర స్వామి సేవా సమితి వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు కాసుల అనసూయ సంస్మరణ సభ జరగనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి సలహాదారులు కొండూరు వినోద్ కుమార్ ఆదివారం తెలిపారు. అనసూయ జ్ఞాపకార్థం పాటలు, భజనలు, భక్తి గీతాలు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మించు ఆనంద్‌రావు, ఉద్దాడి చిత్తరంజన్ రావు, మార్గం విజయ్ కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

అవార్డుల అందజేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని నైబర్‌హుడ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం తైక్వాండోలో బెల్ట్ గ్రేడ్ టెస్టు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి హాజరై ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వేణు, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ రాజీనామా



కవాడిగూడ: బీఆర్ఎస్ పార్టీకి దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ చిన్న చూపు చూస్తోందని రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీలో నేటికీ కుటుంబ పాలనే కొనసాగుతోందని, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం లేదన్నారు.

బీఆర్ఎస్ డివిజన్ నూతన అధ్యక్షుడు



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొండా శ్రీధర్ రెడ్డి నియమితులైయ్యారు. ఆదివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్‌లో పని చేస్తున్నానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్ష పదవి అప్పగించిన ఎమ్మెల్యేకు, ఇతర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

షబ్బీర్ అలీకి సన్మానం



చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియమితులైన సందర్భంగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి ఆదివారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట: అయోధ్య ఆలయ ప్రారంభం పురస్కరించుకొని సోమవారం(నేడు) దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్.రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యపురిలో ఉన్న దత్తసాయి దంత వైద్యశాలల్లో ఈ శిబిరం ఉంటుందన్నారు. 92463 66944 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్వీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా రంగ స్థితి, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. దేశ సగటు అక్షరాస్యతలో తెలంగాణ వెనకబడి ఉందన్నారు. నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా బాలికల అక్షరాస్యతను పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి రవి, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

అంబర్‌పేట్: గోల్నాకలోని పురాణ్ శాంతిశీల హోమ్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరి దేవేందర్ కార్యదర్శిగా, తీరు నగరి రాఘురాం ఉపాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, కోశాధికారిగా మాధవీలత ఎన్నికయ్యారు.









సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383